క్లుప్తంగా

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

గాజువాక: కర్ణవానిపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని సుందరయ్య కాలనీ ఫీడర్, స్వతంత్రనగర్, జీవీఎంసీ వాటర్ వర్క్స్ ఫీడర్లకు ఈ నెల 18న నిర్వహణ పనులు చేపట్టనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా ఆయా ఫీడర్ల పరిధిలోని సుందరయ్య కాలనీ, అఫీషియల్ కాలనీ, శ్రీనగర్ దిబ్బపాలెం కాలనీ, కృష్ణదేవరాయ నగర్, పాతకర్ణవానిపాలెం, శ్రీరామ్‌నగర్, శ్రీనగర్, స్వతంత్రనగర్, జీవీఎంసీ పంప్ హౌస్, పోర్టు రోడ్ ఏరియాలలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలియజేశారు.

టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లు



కిట్ అందిస్తున్న డాక్టర్ హేమలత

పెదగంట్యాడ: టీబీ వ్యాధిగ్రస్తులు మందులు వాడడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని పెదగంట్యాడ, గాజువాక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ హేమలత, డాక్టర్ సుధాకర్, డాక్టర్ బద్రీనాథ్ సూచించారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పెదగంట్యాడ, గాజువాక సీహెచ్‌సీ ల పరిధిలోని 66మంది టీబీ వ్యాధిగ్రస్తులకు బుధవారం పెదగంట్యాడ ఆరోగ్య కేంద్రంలో పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తన కాల సత్యనారాయణ, భూలక్ష్మి, రాణి, సుజాత త్రివేణి, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రావణ మాస పూజలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ఈ నెల 18వ తేదీ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు నిజ శ్రావణ మాస విశేష పూజలు నిర్వహించనున్నట్లు దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. శ్రావణ శుక్రవారాలతో పాటు సెప్టెంబర్ 7న శ్రీ కృష్ణాష్టమి రోజు ప్రత్యేక పూజలు చేస్తామని తెలియజేశారు.

ఉత్సాహంగా ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్



విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న డీఓ-11 జట్టు క్రీడాకారులు

ఉక్కునగరం: కల్నల్ సీ.కె. నాయుడు స్టేడియంలో నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా సాగింది. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె. మొహంతి నేతృత్వంలో డీసీ-11, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఇన్‌చార్జి ఎ.కె. బాగ్చీ నేతృత్వంలో డీఓ-11 జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సీజీఎం (వర్క్స్) బి.కె. మొహంతి, సీజీఎం (మెడికల్) డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్‌తో పాటు పలువురు జనరల్ ఆస్పత్రి వైద్యులు, అధికారులు పాల్గొన్నారు. ఇరు జట్ల మధ్య 14 ఓవర్ల మ్యాచ్ జరిగింది. ముందు డీసీ-11 జట్టు బ్యాటింగ్‌కు దిగింది. అనంతరం బ్యాటింగ్ చేసిన డీఓ-11 జట్టు 13 ఓవర్లలో 93 పరుగులు చేసి విజయం సాధించింది. సీజీఎం (వర్క్స్) బి.కె. మొహంతి విజేత డీసీ-11 జట్టుకు ట్రోఫీ అందజేశారు.

ఫొటోగ్రఫీ ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వాల్తేర్ ఫొటోగ్రఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ ప్రదర్శన జరగనుంది. ఈ నెల 19, 20 తేదీల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రాంగణంలో నిర్వహించే ఈ ప్రదర్శన వివరాలతో కూడిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పి.ఎస్.సేతు, కార్యదర్శి ఎం.వి.శ్రీనివాసరెడ్డి, కోశాధికారి వి.వి.రామరాజు, సభ్యులు కె.ఎం.కె.రమేష్, సన్నీ పాల్గొన్నారు.

నిరంతరాయంగా.. నాణ్యమైన విద్యుత్

- పెదగంట్యాడలో లో ఓల్టేజీ సమస్యకు చెక్
- అదనపు సామర్థ్యంతో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- విద్యుత్ స్తంభాలు, తీగల మార్పిడి
- ఫలించిన ఈపీడీసీఎల్ అధికారుల చర్యలు



సమతానగర్ సాయిబాబా ఆలయం వద్ద పాత స్తంభాలను మార్చుతున్న సిబ్బంది

పెదగంట్యాడ: మండల పరిధిలో విద్యుత్ లో ఓల్టేజీ సమస్యకు అధికారులు చెక్ చెప్పారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు లేకుండా నిరంతరాయంగా విద్యుత్ అందించడంపై దృష్టి పెట్టిన ఈపీడీసీఎల్ అధికారులు అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టారు. పాడైన విద్యుత్ స్తంభాల మార్పిడి, సింగిల్ ఫేజ్ నుంచి త్రీ ఫేజ్‌కు మార్చడం, సబ్‌స్టేషన్‌లో సాంకేతిక లోపాలను సరిదిద్దడం వంటి చర్యలు చేపట్టి, నిరంతరం నాణ్యమైన కరెంటును అందిస్తున్నారు. దీనిపై విద్యుత్ వినియోగదారుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో ఇలా..

మండలంలోని పలు ప్రాంతాల్లో గతంలో ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, సరఫరాలో హెచ్చుతగ్గులతో ప్రజలు ఇబ్బంది పడేవారు. కరెంట్ పోయి వచ్చిన తర్వాత ఒక్కోసారి లో ఓల్టేజీతో ఫ్యాన్లు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు పని చేయకుండా మొరాయించేవి. ఒక్కోసారి ఎక్కువగా సరఫరా కావడంతో విద్యుత్ ఉపకరణాలు పాడైపోయేవి. ముఖ్యంగా విద్యుత్‌పై ఆధారపడి వ్యాపారాలు చేసుకునేవారు చాలా ఇబ్బంది పడేవారు. దీనిపై విద్యుత్ శాఖాధికారులు ఫిర్యాదు చేయడంతో సమస్య పరిష్కారంపై అధికారులు దృష్టి సారించారు. ఇక్కడి పరిస్థితిని ఈపీడీసీఎల్ పెదగంట్యాడ ఏఈ డి.శివ దుర్గా ప్రసాద్ జోన్-2 ఈఈ బీకే నాయుడికి తెలియజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో చకచకా చర్యలు చేపట్టి, మండలంలో ఎక్కడా సమస్య లేకుండా పరిస్థితిని చక్కదిద్దారు.

సమస్యలకు చెక్ చెప్పారిలా..

- టీజీఆర్ నగర్‌లో విద్యుత్ వైర్లు మార్చి, లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించారు.
- సీతానగరంలో ట్రాన్స్‌ఫార్మర్‌పై పాత వైర్లను తొలగించి, కండక్టర్ వేశారు.
- నెల్లిముక్కు ఏరియాలో అదనపు సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు.
- సమతానగర్ సాయిబాబా గుడి వద్ద పాడైన స్తంభాలను తొలగించి కొత్తవి వేశారు.
- సిద్దేశ్వరం కొండపై ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలను సరి చేశారు.
- పెదగంట్యాడ అర్బన్ సెక్షన్ పరిధిలో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేశారు. అలాగే సెక్షన్ బాక్సులు మార్చారు. విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు. విద్యుత్ సరఫరాలో సమస్యలను పరిష్కరించారు.
- పెదగంట్యాడ 33/11కేవీలోని సాంకేతిక లోపాలను సరిదిద్దారు.
- చిన కోరాడలో 1ఫేస్ నుంచి 3 ఫేస్‌కు విద్యుత్ వైర్లను అమర్చారు.
- పెదగంట్యాడ అర్బన్ సెక్షన్ పరిధిలో 11కేవీ విద్యుత్ జంపర్లను పటిష్టపరిచారు.



పెదగంట్యాడ అర్బన్ సెక్షన్ పరిధిలో 11కేవీ విద్యుత్ జంపర్లను పటిష్టం చేస్తున్న దృశ్యం



విద్యుత్ ఉప కేంద్రంలో సాంకేతిక లోపాలను సరిదిద్దుతున్న సిబ్బంది

ఇప్పుడు లో ఓల్టేజీ సమస్య లేదు



నేను వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాను. కరెంట్‌తోనే మా పని సాగుతుంది. గతంలో కరెంట్ నిలిచిపోవడం.. లో ఓల్టేజీ సమస్య కారణంగా పని చేసుకోవడానికి ఇబ్బందులు ఎదురయ్యేవి. దీంతో ఆర్థికంగా ఇబ్బంది పడేవాడిని. అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకు వచ్చేవాడిని. ఇప్పుడు నిరంతరం నాణ్యమైన కరెంట్ వస్తోంది. ప్రతి రోజూ పని చేసుకుంటున్నాను.

–నీలాపు భానుశంకర్, వెల్డింగ్ షాపు, నెల్లిముక్కు

విద్యుత్ కోతల్లేవు



గతంలో విద్యుత్ కోతల కారణంగా అవస్థలు పడేవాళ్లం. లో ఓల్టేజీ సమస్యతో సతమతమయ్యేవాళ్లం. ఒక్కోసారి హై-ఓల్టేజీ రావడంతో ఇంట్లోని విద్యుత్ ఉపకరణాలు పాడయ్యేవి. తరచూ మరమ్మతులు చేయించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ సమస్య లేదు. విద్యుత్ సరఫరా బాగా ఉంది.

– కొండకంచి యమున, గృహిణి, పెదనడుపూరు

నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం



వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. పాడైన స్తంభాలు, వైర్లు మార్చాం. సింగిల్ ఫేజ్ పవర్‌ను త్రీ ఫేజ్‌కు మార్చాం. కండక్టర్లు మార్చి, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. సబ్ స్టేషన్‌లో సాంకేతిక సమస్యలను పరిష్కరించాం. భవిష్యత్తులోనూ ఎలాంటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నాం.

–బీకే నాయుడు, ఈఈ, ఏపీఈపీడీసీఎల్ జోన్-2

అదనపు టోల్ ఫీజులపై ఆందోళన



టోల్‌గేటు వద్ద ఆందోళన చేస్తున్న లారీ యజమానులు, డ్రైవర్లు

అగనంపూడి: అదనపు టోల్ ఫీజుల భారాన్ని నిరసిస్తూ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అగనంపూడి టోల్‌గేటు వద్ద బుధవారం ఆందోళనకు దిగారు. గాజువాక, అనకాపల్లి జీవీఎంసీ పరిధిలోనే ఉన్నా అదనపు భారం వేయడం ఏమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకుడు కేశరపు శ్రీను మాట్లాడుతూ ఇప్పటి వరకు ఈ ప్రాంతాల మధ్య రాకపోకలు సాగించే స్థానిక లారీలకు ఒక పక్క రూ.165 రెండో వైపు మరో రూ.165 వసూలు చేసేవారని తెలిపారు. ఇప్పుడు కొత్తగా ఒక వైపు రూ.335, రెండో వైపు మరో రూ.165 టోల్ కాంట్రాక్టర్ వసూలు చేయడం, దానికి హైవే అధికారులు వత్తాసు పలకడం అన్యాయమని పేర్కొన్నారు. గాజువాక ఆర్టీవో విశాఖ పరిధి కాదని, అనకాపల్లి జిల్లాలోకి వస్తుందని కాంట్రాక్టర్ చెప్పడం దారుణమని ఆరోపించారు. ఇలాగే కొనసాగిస్తే వాహనాల రాకపోకలను స్తంభింపజేసి, టోల్‌గేటు వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకుడు నెల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మూడు రోజులుగా ఎటువంటి సమాచారం లేకుండా అడ్డగోలుగా ఫాస్ట్ ట్రాక్‌లో కోత విధిస్తున్నారని, ఈ విషయంలో ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని టోల్ దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.మహేష్, జి.తాతారావు, జి.సూరిబాబు, కె.శ్రీను, వి.నరసింగరావు, జి.రామారావు, జి.శ్రీను, వెంకటరావు పాల్గొన్నారు.

గాజువాక ఆర్టీవో పరిధిలో లారీలకు మాత్రమే...

దువ్వాడ పోలీసులు సూచనల మేరకు టోల్ కాంట్రాక్టర్‌తో చర్చించిన ఆందోళనకారులు కేవలం గాజువాక ఆర్టీవో పరిధిలోని గ్రామాల్లో లారీలకు మాత్రమే పాత పద్ధతిలో వసూలు చేయడానికి కాంట్రాక్టర్ అంగీకరించారని తెలిపారు. అనకాపల్లి ఆర్టీవో కార్యాలయ పరిధి గ్రామాల్లోని వాహనాలకు అక్కడి కాంట్రాక్టర్‌తో చర్చలు జరపాల్సి ఉందన్నారు.

తోపుడు బళ్లకు అనుమతివ్వాలని వినతి



జెడ్సీకి వినతిపత్రం అందిస్తున్న యువశ్రీ, తోపుడు బండ్ల సంఘం ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ప్రాంతంలో సర్వీసు రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు, పండ్ల దుకాణాలు నిర్వహించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలాన్ని చిరు వ్యాపారులు కోరారు. వైఎస్సార్‌సీపీ రజక సంఘం డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ ఆధ్వర్యంలో తోపుడు బళ్లు, స్టాళ్ల నిర్వాహకుల సంఘం ప్రతినిధులు జెడ్సీని కలిసి, వినతిపత్రం అందజేశారు. షీలానగర్‌లో సర్వీసు రోడ్డు పక్కన నిర్వహించే పళ్ల బండ్లు, చిరు వ్యాపారం నిర్వహించే స్టాళ్లను జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించడంతో సుమారు 40మందికి పైగా వ్యాపారులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. తోపుడు బళ్లు, స్టాల్స్ ఏర్పాటుకు అనుమతివ్వాలని విజ్ఞప్తి చేశారు.

అ‘పూర్వ’కలయిక .. ఆనంద వేడుక



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గాజువాక: మూడు దశాబ్దాలు దాటిన స్నేహగంధం స్థానిక లయన్స్‌క్లబ్‌లో పరిమళాలు వెదజల్లింది. నాటి జ్ఞాపకాలు.. నేటి క్షేమ సమాచారాలతో ప్రాంగణమంతా సందడిగా మారింది. ఒకటా.. రెండా.. దాదాపు 32 సంవత్సరాల తర్వాత కలుసుకున్న అలనాటి మిత్రబృందం ఆనందానికి ఆకాశమే హద్దయింది. గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1990–91 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఆత్మీయ సమావేశం బుధవారం పండగ వాతావరణాన్ని తలపించింది. పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా హాజరు కావడంతో ఆ ప్రాంగణం సందడిగా మారింది. వివిధ వృత్తులు, ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడి బిజీగా ఉన్నవారంతా సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న కేఎన్నార్ ఫౌండేషన్ చైర్మన్ కరణంరెడ్డి నర్సింగరావును ప్రశంసించారు. ఈ సందర్భంగా తమ మిత్రులను ఆయన శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో దువ్వాడ ఏఎస్‌ఐ నర్సింగరావు, డిజిటల్ ఎక్స్‌ప్రెస్ ఎండీ బాలా కుమార్, ఎంఆర్ స్కూల్ కరస్పాండెంట్ రియాజ్, సోనా జీన్స్ యజమాని జబ్బర్, నిర్వాహక కమిటీ ప్రతినిధులు పద్మావతి, కృష్ణ, గంగవరం తాతారావు, రాజు, మోహన్, రామకృష్ణ గౌడ్, అచ్చిరెడ్డి, శ్రీను, గురయ్య తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరిగా నూకాంబిక



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో వెలసిన శ్రీ శ్రీ నూకాంబిక అమ్మవారిని బుధవారం అమావాస్య సందర్భంగా శాకాంబరిగా అలంకరించారు. 40వ వార్డు కార్పొరేటర్, ఆలయ ధర్మకర్త గుండపు నాగేశ్వరరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సంక్షేమ ప్రదాత సీఎం జగన్



సంక్షేమ పథకాల కరపత్రాన్ని లబ్ధిదారుకు అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న శ్రామికుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. కుల, మత, వర్గ విభేదాల్లేకుండా, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 86వ వార్డు ఫకీర్‌టకియా, ఎస్సీకాలనీ సచివాలయ-1 పరిధిలో బుధవారం ఆయన పర్యటించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి దామా సుబ్బారావుతో కలసి ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులను కలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, వార్డు అధ్యక్షుడు వెలుగుల పరశురాముడు, చేగొండి శ్రీనివాసరావు, సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాస్‌పట్నాయక్, మాటూరి శ్రీనివాసరావు, బాలకృష్ణ, వార్డు మహిళా అధ్యక్షురాలు నిర్మల, వరలక్ష్మి, శ్రీను, పట్నాల రాజు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



పెందుర్తి వెంకటాద్రిపై స్వామి ఉత్సవ మూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

వెంకటాద్రిపై..

వెంకటాద్రిపై బుధవారం వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. చాతుర్మాస పూజల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీదేవి,భూదేవి సమేతంగా వెంకన్న ఉత్సవ మూర్తులను వేదికపై అధిష్టంపజేసి కల్యాణం వేడుకగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉక్కు ఉద్యమం మరింత ఉధృతం

ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నేటి నుంచి బస్సు యాత్ర



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జె.వి.సత్యనారాయణ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు నినాదంతో, ఎంతోమంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకునేందుకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జె.వి.సత్యనారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షల్లో 916వ రోజు బుధవారం సంస్థకు చెందిన ఎస్ఎంఎస్-1 విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు కూర్చున్నారు. శిబిరాన్ని సందర్శించిన జేవీ సత్యనారాయణ మాట్లాడుతూ సీపీఐ, ఏఐటీయూసీ సంయుక్తంగా ఈ నెల 17వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర నిర్వహించి, ఉక్కు ఉద్యమంపై ప్రజలను చైతన్యపరుస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల కర్మాగారం ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలో కొనసాగితే నిర్వాసితులకు, కార్మికులకు న్యాయం జరుగుతుందని ప్రజలకు తెలియజేస్తామన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్రం తన నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర ఏర్పాట్ల పరిశీలన

కూర్మన్నపాలెం జంక్షన్‌లో గురువారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న బస్సు యాత్ర ఏర్పాట్లను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జె.వి.సత్యనారాయణ బుధవారం పరిశీలించారు. బస్సు యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించి, చైతన్యం తీసుకువస్తామన్నారు.

ఈసీ షెడ్యూల్ ప్రకారం నూతన పోలింగ్ కేంద్రాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో లక్ష్మారెడ్డి

గాజువాక: కేంద్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు ఓటర్ల నమోదు అధికారి డి.లక్ష్మారెడ్డి తెలిపారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గాజువాకలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. దీనిపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరుతూ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన అవసరాలను వివరించారు. పోలింగ్ ఏరియాలు, పోలింగ్ బూత్‌లను నిర్ణయించే విషయాన్ని గూగుల్ మ్యాప్ సహాయంతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కాగా, ఓటర్ల జాబితాలపై చేపట్టిన ఇంటింటి సర్వే 60 శాతం పూర్తయిందని తెలిపారు. సమావేశంలో జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్నకు ఘన నివాళి



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, లక్ష్మి



గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న పెట్రోల్ బంక్ సిబ్బంది

పెదగంట్యాడ: సర్దార్ గౌతు లచ్చన్న సేవలు మరువలేమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. యాత శెట్టిబలిజ గౌడ ఈడిగ శ్రీశయన సంక్షేమ సంఘం అధ్యక్షుడు అండిబోయిన అప్పారావు ఆధ్వర్యంలో వుడా కాలనీలో గౌతు లచ్చన్న జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి చేతుల మీదుగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పితాని శంకరరావు, పూడి రమణ, వెంపాడ అప్పారావు, వానపల్లి పైడిరాజు, చప్పిడి నాగరాజు, గెద్దాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ

యాత శెట్టిబలిజ గౌడ ఈడిగ శ్రీశయన సంక్షేమ సంఘం అధ్యక్షుడు నెల్లి సాధూరావు ఆధ్వర్యంలో గౌతు లచ్చన్న జయంతిని పెదగంట్యాడ కూడలి వద్ద నిర్వహించారు. లచ్చన్న చిత్ర పటానికి ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఏసీపీ త్రినాథ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దివ్యాంగులకు దుప్పట్లు, విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏకుల వెంకటేష్ గౌడ్, నెల్లి అప్పలరాజు, పిల్లి వీరబాబు, నెల్లి తులసి, పోలవరపు రమణబాబు, బత్తిన పరదేశి, జెర్రిపోతుల గోవింద తదితరులు పాల్గొన్నారు.

షీలానగర్ పెట్రోల్ బంక్ వద్ద..

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ పెట్రోల్ బంక్ వద్ద గౌతు లచ్చన్న జయంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి బంక్ యాజమాన్యం, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.

87వ వార్డులో..

కూర్మన్నపాలెం: రైతుబంధు గౌతు లచ్చన్న జయంతిని 87వ వార్డులో శ్రీ రథాలమ్మ శెట్టి బలిజ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్రానికి ముందు, ఆ తరువాత ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం అన్నారు. కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, శ్రీ రథాలమ్మ శెట్టి బలిజ యువజన సేవా సంఘం సభ్యులు పోతల కృష్ణ, గెద్దాడ రాంబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి సేవలు చిరస్మరణీయం



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గాజువాక: మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా బీజేపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రిగా ఆయన దేశంలోని జాతీయ రహదారులను అద్భుతంగా అభివృద్ధి చేశారన్నారు. రూ.1333 కోట్లను ఇచ్చి విశాఖ ఉక్కును ఆదుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు, కట్టా పద్మ, రోహిణి, రాజశేఖర్, రామస్వామి, రామునాయుడు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై ఇంజినీరింగ్ అధికారుల పర్యటన



సింహగిరిపై పరిశీలన చేస్తున్న ఏయూ విశ్రాంత ప్రధాన ఇంజినీర్ మాధవ్, దేవస్థానం అధికారులు

సింహాచలం: సింహగిరిపై పలు నిర్మాణాలు చేపట్టేందుకు అనువైన ప్రదేశాలను గుర్తించడానికి బుధవారం ఏయూ విశ్రాంత ప్రధాన ఇంజినీర్ డాక్టర్ జి.మాధవ్, దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు, ట్రస్టుబోర్డు సభ్యులు పర్యటించారు. సుమారు రూ.4 కోట్లతో కార్ల పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి గజపతి కాటేజీ వెనుక వైపు ఉన్న స్థలాన్ని పరిశీలించారు. అలాగే ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ నిర్మాణం, అన్నప్రసాద సత్రంపై ప్రసాదాల తయారీకి అదనపు అంతస్తు నిర్మాణం తదితర ప్రణాళికపై చర్చించారు. దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, ట్రస్టుబోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్ పాల్గొన్నారు.